


## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో ఆ950–ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# కుంచించుకుపోతున్న భార్య
# {మైఖేల్ జరాయ్ రచనకి స్వేచ్ఛానువాదం}

*(కథాకాలం జూలై 1962)*

"హెన్రీ. ఈ కుర్చీలు తగ్గిపోతున్నట్లున్నాయి" థెల్మా భర్తతో చెప్పింది.

లివింగ్ రూములోని హెన్రీ కుర్చీలోని తన లావుపాటి భార్యని చూసాడు.

కుర్చీలో కూర్చున్న ఆమె కాళ్ళు నేలకి ఆని ఉన్నాయి.

"తగ్గిపోతున్నాయా? అంటే?" అతను అడిగాడు.

"కుంగుతున్నాయి. నేలకి దగ్గరవుతున్నాయి."

"ఏ కుర్చీ?"

"అన్నీ. లివింగ్ రూములోని అన్నీ. డైనింగ్ రూములోని కుర్చీలు, వంటగదిలోని కుర్చీలు. అన్నీ చూసాను. అన్నీ పొట్టయ్యాయి."

"అవి తగ్గడం నువ్వు గమనించావా?" అతను అడిగాడు.

"లేదు. కానీ గత రెండు, మూడు వారాల్లో అవి పొట్టయ్యాయని నాకు తెలుస్తోంది."

"నేను గజం బద్ద తెస్తాను" హెన్రీ లేస్తూ చెప్పాడు.

"నేను కొలిచాను. అవి అంత తగ్గినట్లుగా లేవు. కానీ తగ్గాయని నాకు తెలుస్తోంది."

"నీకు ఒంట్లో బావుందా?" హెన్రీ ఆదుర్దాగా అడిగాడు.

"అలా చూడకు. బానే ఉన్నాను" హెన్రీ భార్య చెప్పింది.

"నువ్వు ఆఫీస్‌లో కష్టపడి పనిచేస్తున్నావు. అందుకని.." ఆపేసాడు.

"హెన్రీ నోర్మూసుకో. నేను  బానే ఉన్నాను."

"కానీ?"

"నోర్మూసుకోమన్నానా?"

హెన్రీకి థెల్మా మొహంలో కొంత గందరగోళం కనిపించింది.

"నాకు అర్థంకాలేదు, థెల్మాకి కుర్చీలు కుంచించుకున్న భావన ఎలా కలిగించావు?" హెన్రీ మిత్రుడు థాగ్ అడిగాడు.

వారిద్దరూ పార్క్‌లోని బెంచీమీద కూర్చుని ఉన్నారు.

"అవి కుంచించుకుపోతున్నాయి కనుక."

"ఎలా?"

"శాండ్ పేపర్. ప్రతిరోజూ థెల్మా ఆఫీస్‌లో ఉన్నప్పుడు నేను అన్ని కుర్చీల కాళ్ళకింద అంగుళంలో వందోవంతు చెక్కేస్తుంటాను. ప్రతిరోజూ ఇలా కుర్చీలు వెంట్రుకవాసి కుంచించుకుపోతూంటాయి. థెల్మా తెలివిగలది కాబట్టి మార్పుని గమనిస్తోంది" హెన్రీ వివరించాడు.

"సరే. కానీ ఎందుకు? రివాల్వర్ అయితే నేను అర్ధం చేసుకోగలను. లేదా కత్తి. లేదా విషం. ఇది ఎలా పనిచేస్తుంది?"

"థెల్మాలాంటి పాజిటివ్ పర్సన్ నెగటివ్‌గా మారితే ఇక జీవించలేదని ఓ సైకాలజీ ప్రొఫెసర్ రాసిన పుస్తకంలో చదివాను. థెల్మాకి ఆత్మవిశ్వాసం అధికం. తొణకదు."

"నా భార్యలానే అన్నమాట." థాగ్ గొణిగాడు.

"నేను ఆమెని నెగెటివిటీలోకి తోయడానికి ఆ పని చేసాను. అర్ధమైందా?"

"లేదు."

"జరగకూడనివి నెగిటివ్ పద్ధతిలో జరుగుతూంటే? కుర్చీలు కుంచించుకుపోవడంలాంటివి. ఆమె తన మానసిక ఆరోగ్యం గురించి భయపడుతుంది. ఆమెలోని స్థిరత్వం తగ్గుతుంది. అది తగ్గేకొద్దీ.. అర్ధమైందా?"

"ఏమో? ప్రొఫెసర్స్ ఆలోచనలు ప్రాక్టికల్‌కావు అనిపిస్తోంది. నాకైతే విషమే ఇష్టం" థాగ్ చెప్పాడు.

"వేచి చూడు. ఇది ఎలా పరిణమిస్తుందో చూద్దాం" హెన్రీ చెప్పాడు.

హెన్రీ పార్క్‌లోంచి సూపర్ బజార్‌కి వెళ్ళి ఇంటికి కావల్సిన సరుకులు కొని, ఇంటికి వెళ్ళి రాత్రి భోజనం వండసాగాడు. తన మిత్రుడు థాగ్‌లా హెన్రీకూడా నిరుద్యోగ భర్త.

వాళ్ళకి ఉద్యోగం దొరక్కకాదు. వారి భార్యల జీతం సరిపోతుంది కాబట్టి వాళ్ళు కష్టపడదలచుకోలేదు. వారి భార్యలే చురుకైనవాళ్ళు. ఆ ఇద్దరు భర్తలు ఎక్కువకాలం పార్క్‌లోని బెంచ్ మీద గడుపుతూంటారు. ఇద్దరికీ పరిచయం కూడా అక్కడే అయింది. తమ భార్యల్ని ద్వేషించడంలోనూ, బద్ధకంలోనూ ఇద్దరూ సమానమే. వారి మాట నెగ్గదు. తమ భార్యల అభిరుచి ప్రకారమే ఇంట్లోని సామాను ఉంచడంకాని, వంట చేయడం కాని ఏదైనా జరుగుతూంటుంది. ఆడ నియంత అని వాళ్ళు తమ భార్యల్ని సంబోధించుకుంటూంటారు. వాళ్ళిద్దరూ విడాకుల గురించి ఆలోచించలేదు. ఎందుకంటే భరణం కూడా రాదు.

థెల్మాకి ఏదైనా ఐతే ఇన్సూరెన్స్ సొమ్ము, బేంక్‌లోని మొత్తం కలిపి వచ్చే డబ్బు చాలాకాలం సుఖంగా బతకడానికి సరిపోతుంది.

రాత్రి ఇంటికి తిరిగి వచ్చాక థెల్మా భోజనం చేస్తూ మెచ్చుకోలుగా చెప్పింది.

"ఎప్పటిలా నీ వంట బావుంది."

థెల్మా తన ఆఫీస్ గొడవలు చెప్తూంటే, హెన్రీ మౌనంగా గిన్నెలు తోమడంలాంటి పనులని చేయసాగాడు.

తర్వాత థెల్మా చేతిలో గజం బద్దతో ఇల్లంతా తిరుగుతూ, కొలుస్తూ తలని అడ్డంగా ఊపుతూ కుర్చీలని చూడటం గమనించాడు.

వారం తర్వాత ఓ రోజు థెల్మా చెప్పింది.

"నేను బరువు తగ్గుతున్నాను హెన్రీ. నాలుగు పౌన్లు తగ్గాను."

"మంచిది. ఆడవాళ్ళు సన్నబడటం మంచిదేగా?" హెన్రీ చెప్పాడు.

"నీకు అర్థం కాలేదు. చాలా సంవత్సరాలుగా నేను నూట డెబ్బై ఐదు పౌన్లు తగ్గలేదు. నేను బరువు తగ్గే ప్రయత్నం కూడా  చేయడంలేదు."

"ఐతే అది నార్మల్ కాదు" హెన్రీ చెప్పాడు.

"నేను డైటింగ్ చేయడంలేదు. కాబట్టి బరువు తగ్గకూడదు."

"అది నిజమే. నువ్వు ఎప్పట్లానే తింటున్నావు. కుర్చీలు కుంచించుకుపోయాయని బహుశా నువ్వు మానసికంగా ఎక్కువ బాధపడుతున్నావేమో? ఓసారి డాక్టర్‌ని కలిస్తే మంచిదేమో?"

"అవసరంలేదు. నేను ఆరోగ్యంగానే ఉన్నాను."

వారం తర్వాత థెల్మా మళ్ళీ చెప్పింది.

"నేను మళ్ళీ మూడు పౌన్లు తగ్గాను."

"నువ్వు ఎక్కువ తినడంలేదేమో?" హెన్రీ సూచించాడు.

"మీ ఆవిడ బరువు తగ్గేలా ఎలా చేస్తున్నావు?" పార్క్ బెంచీమీద కూర్చున్న థాగ్ అడిగాడు.

"కేలరీ కంట్రోల్. ఆమె గమనించని లో కేలరీ డైటింగ్ పదార్థాలతో వంటచేస్తున్నాను. ఆమె ఎంత తిన్నా బరువు తగ్గుతోంది."

"అలాగా?" అతను ఆలోచనగా చెప్పాడు.

రెండు వారాల తర్వాత థెల్మా చెప్పింది.

"హెన్రీ ఇంట్లోని లైట్లు డిమ్ అవుతున్నట్లు అనిపిస్తోంది."

"అంటే? నాకర్థం కాలేదు" హెన్రీ చెప్పాడు.

"వెలిగినప్పటికన్నా, క్రమంగా కాంతి బలహీనపడి మన అపార్టుమెంట్ చీకటిగా మారుతోంది. చదివేప్పుడు నా కళ్ళకి వత్తిడి కలుగుతోంది."

"కానీ అలాంటిదేం లేదే? నేను చక్కగా చదవగలుగుతున్నాను."

"లేదు. లైట్ డిమ్ అవుతున్నట్లు అనిపిస్తోంది."

"అంటే? నాకర్థం కాలేదు" హెన్రీ చెప్పాడు.

"లేదు. లైట్ డిమ్ అవుతోంది. ఏం జరుగుతోందో చెప్పు."

"ఏం జరగడంలేదు. బహుశా నీ కళ్ళు పరీక్షించుకోవాలేమో?"

"అవసరంలేదు ఆఫీస్‌లో బానే కనిపిస్తున్నాయి. మన బల్బ్‌లు పాతవైనట్లున్నాయి. రేపు కొత్తవి తెచ్చిపెట్టు" కోరింది.

మర్నాడు రాత్రి హెన్రీ ఆమెని అడిగాడు.

"కొత్త బల్బులతో వెలుతురు బావుందా?"

"లేదు లైట్ ఇంకా తగ్గింది."

హెన్రీ ఆమెవంక దీక్షగా చూసాడు. ఆమె కళ్ళలోని గందరగోళం ఇంకాస్త ఎక్కువగా కనిపించింది.

"హెన్రీ నాలో ఏదో తేడా గమనిస్తున్నాను" థెల్మా అకస్మాత్తుగా చెప్పింది.

"నాకూ అలాగే అనిపిస్తోంది."

"నేను చక్కగా తింటున్నా బరువు కోల్పోతున్నాను. కుర్చీలు కురచైన భావన. ఇంట్లో మాత్రమే. ఆఫీస్‌లో కాదు. ఆఫీస్‌లో ఎందుకు కావడంలేదు?"

"ఆఫీస్‌లో నీకు పనెక్కువ కదా. దాన్లో మునిగిపోయి కావచ్చు."

"కానీ మన కుర్చీలని పదిసార్లకి పైనే పరీక్షించాను అవి మాములుగానే ఉన్నాయి. కొత్త బల్బులు పెట్టినా కాంతి తగ్గుతోంది. నాకు ఒకటే వివరణ తడుతోంది. నాలో ఏదో మార్పు వచ్చింది. రేపు చెకప్‌కి డాక్టర్ దగ్గరకి వెళ్తాను."

"అదే మంచిది." హెన్రీ గొణిగాడు.

"ఎలా చేసావు?" థాగ్ ప్రశ్నించాడు.

"చాలా తేలిక. చిన్న పరికరం. మెకానిక్స్ మేగజైన్‌లో దాని ప్రకటన వచ్చింది. ఆ పత్రికని థెల్మా ఎప్పుడూ చదవదు. దాన్ని సర్క్యూట్‌లో బిగించి, దాని నాబ్‌ని తిప్పుతు లైట్‌ని పెంచొచ్చు, తగ్గించొచ్చు. వాటిని ఫ్యూజ్ బాక్స్‌లోని సర్క్యూట్స్‌కి బిగించాను. ఫ్యూజ్ బాక్స్ ఉంటుందని కూడా థెల్మాకి తెలీదు. రోజుకి వెంట్రుకవాసి నాబ్‌ని తిప్పుతున్నాను. స్థిరమైన మనిషికాబట్టి థెల్మా ఆ మార్పుని గమనిస్తోంది."

"మంచిది. కాని దీనివల్ల లాభం?"

"ఉందనుకుంటున్నాను. థెల్మాలోని స్థిరత్వం, ఆత్మవిశ్వాసం తగ్గుతున్నాయి. కావలసినంత తగ్గడానికి ఇంకా కొంతకాలం పడుతుంది."

డాక్టర్ థెల్మాని బాగా పరీక్షించాక చెప్పాడు.

"శారీరకంగా మీలో ఎలాంటి తేడా లేదు. కంటిచూపు కూడా బానే వుంది. బహుశా మీలో ఎందుకో భయం ఏర్పడిందనుకుంటా."

"నేనెప్పుడూ ధైర్యస్తురాలినే" ఆమె నవ్వుతూ చెప్పింది.

"మీరు ఎక్కువ విశ్రాంతి తీసుకోవాలి."

థెల్మా విశ్రాంతి తీసుకోవడం హెన్రీకి నవ్వు పుట్టించింది. పుస్తకం చదువుతూనో, టివి చూస్తూనో అయిష్టంగా విశ్రాంతి తీసుకోసాగింది. మధ్య మధ్యలో చాలాసేపు శూన్యంలోకి చూస్తూండిపోతుంది. థెల్మా అయిష్టంగానే నిద్రమాత్రలని వేసుకోసాగింది. ఆఫీస్‌నించి ఇంటికి వచ్చాక హెన్రీని నాటకాలకి, సంగీత కచేరీలకీ, ఇండోర్ గేమ్స్ కి తీసుకెళ్ళసాగింది.

ఆమె మానసిక అశాంతి లక్షణాల గురించి వారి మధ్య చర్చ రాకపోయినా, అది ఆమెలో అనుమానంగా మొదలై స్థిరపడిందని హెన్రీ గుర్తించాడు. అకస్మాత్తుగా ఆమె ఏదో ఆలోచిస్తూ కనిపిస్తుంది. ఒకోసారి విసుగ్గా హెన్రీమీద అరుస్తుంది హెన్రీ మాత్రం అమాయకంగా ఆమెకి కావలసింది సమకూర్చుతాడు.

ఒకోసారి ఆమె అసహజంగా ఆనందంగా ఉంటుంది. కారణం లేకుండా పెద్దగా నవ్వుతుంది. వింత ఉత్సాహం కనిపిస్తుంది. ఆమెకి అలవాటు లేని బద్దకం  కమ్ముకుని చురుకుదనం తగ్గసాగింది. ఆమె కళ్ళల్లో అకస్మాత్తుగా భయం కనిపిస్తోంది.

"ఇలా ఎందుకు జరుగుతుందో నాకు అర్థమైతే తప్ప శాంతిలేదు హెన్రీ" అప్పుడప్పుడు చెప్తుంది.

"నీకు ఇంకా కుర్చీ కుంచించుకునే భావన కలుగుతోందా?" హెన్రీ అడిగాడు.

"అవును."

"బరువు తగ్గడం, కంటిచూపు?"

"కంటి డాక్టర్ చెప్పినా నేను నమ్మను. నాకు చూపులో తేడా ఉంది."

"అది ఉత్త భ్రమేమో?"

"మరి తగ్గిన బరువు గురించి?"

"బరువు సాధారణంగా మానసిక అశాంతి వల్ల తగ్గుతుంది. నువ్వేం ఆలోచించకుండా విశ్రాంతి తీసుకుంటున్నావుగా?"

"అవును. అందుకు విశ్వప్రయత్నం చేస్తున్నాను" ఆమె నిస్పృహగా చెప్పింది.

ఆ రాత్రి థెల్మా చేతులు వణకడం హెన్రీ గమనించాడు.

"హెన్రీ. నిద్రలే" థెల్మా భయంగా అతన్ని కుదుపుతూ లేపింది.

"ఏమిటి?"

"నేను కుంచించుకుపోతున్నాను" చెప్పింది.

"ఏమిటి?"

"కుంచించుకుపోతున్నాను. ఇటీవల నేను మంచం మీద పడుకున్నప్పుడు పొట్టిదాన్నైపోతున్నాను. దాన్ని పట్టించుకోకపోయినా, రోజూ నాకు తెలుస్తోంది" ఏడుస్తూ చెప్పింది.

ఆమెలోని నిబ్బరం తగ్గిపోయిందని గ్రహించిన హెన్రీ చెప్పాడు.

"మొదట కుర్చీలు, ఇప్పుడు నువ్వు. అవునా?"

"అవును. నేను నా ఎత్తుని చెక్ చేసుకున్నాను. దాంట్లో మార్పులేదు. కానీ ప్రతీ రాత్రి పడుకున్నాక కుంచించుకుపోతున్న భావన కలుగుతోంది. నేనెందుకు పొట్టిదాన్నైపోతున్నాను?"

తమ పెళ్ళయ్యాక ఆమె ఏడుపు వినడం హెన్రీకి అదే మొదటిసారి.

"రేపు మళ్ళీ డాక్టర్ దగ్గరికి వెళ్ళు. ఇంకేమీ ఆలోచించకుండా నిద్రపో" హెన్రీ సూచించాడు.

"నిద్ర?" థెల్మా బాధగా చెప్పింది.

"దీన్నెలా చేసావు?" సాయంత్రం హెన్రీ చెప్పింది విన్న థాగ్ ప్రశ్నించాడు.

"తేలిక. ప్రతీ రాత్రి దుప్పటిని మిల్లీమీటర్ చొప్పున పెంచుతున్నాను. అంచుల్ని విప్పదీసి కొత్త హెమ్ ని కుడుతున్నాను. అది పెరగడంతో ఆమెకి పొట్టిదైన భావన కలుగుతోంది. ఆమెలోని స్థిరత్వం, నిబ్బరం, ఆత్మవిశ్వాసం దాదాపుగా మాయమయ్యాయి. ఆ ప్రొఫెసర్ పుస్తకం ప్రకారం వ్యక్తిత్వంలో ఇంతటి మార్పు వస్తే మనిషి ఏం చేస్తాడో ఆ మనిషికే తెలీదు. చూడాలి ఏం జరుగుతుందో."

మర్నాడు హెన్రీ ఇంటిపనులు చేస్తూ ఈల వేసాడు. బట్టలు ఉతికాడు. ఇస్త్రీ చేసాడు. ఇల్లు ఊడ్చాడు. థెల్మాకి నచ్చే వంట చేసాడు. ఆమె ఆఫీస్ నించి వచ్చాక హెన్రీ ఆమెని పరిశీలనగా చూసాడు.

ఒకప్పటి ఆమెబొద్దు శరీరం బాగా సన్నబడింది. మొహం, మెడలోని చర్మం వదులై వేలాడుతోంది. ముఖంలో కళ తగ్గింది. మొహంలో ఆదుర్దా కనిపిస్తోంది.

"థెల్మా! మనం నిజాల్ని ఒప్పుకోవాలి" చెప్పాడు.

"నిజాలనా?" థెల్మా భయంగా అడిగింది.

"నువ్వు ముప్పై ఒక్క పౌన్లు బరువు తగ్గావు. కుర్చీలు, నువ్వు కురచవుతున్న భావన, కంటిచూపు సమస్య నీకు ఇంకా ఉంది."

"ఇప్పుడు నా వినికిడి శక్తి మీద నాకు అనుమానం మొదలైంది. నాకు అన్నిటిమీద అనుమానం కలుగుతోంది" థెల్మా కంఠంలో భయం బాగా కనిపించింది.

"ఇంకా కుంచించుకుంటున్న భావనకూడా ఉందా?"

"ఉంది."

"డాక్టర్ బ్లెక్‌బర్న్ నీ రోగ లక్షణాల్ని అర్థం చేసుకోలేకపోయాడు.  ఆయన సమర్థుడైన డాక్టర్. ఆయన కుదర్చకపోతే మనం అన్నిటికీ సిద్దపడాలి."

"అన్నిటికీ అంటే?"

"భౌతికంగా, మానసికంగా ఆరోగ్యం కోల్పోడానికి. నీకేదో అంతు తెలియని రోగం వచ్చింది. ఈ లక్షణాలు ప్రారంభదశవి అనుకుంటాను."

"అలా చెప్పకు. నాకు భయంగా ఉంది" థెల్మా చెప్పింది.

"ధైర్యం. నువ్వు ధైర్యం తెచ్చుకుని తేలిగ్గా దీంట్లోంచి బయటపడాలి. నువ్వు మాత్రం ఆత్మహత్య గురించి ఆలోచించకు థెల్మా. నీ బాధనించి, అంధకారబంధురమైన భవిష్యత్ నించి నువ్వు స్వతంత్రం కోరుకోవచ్చు."

"ప్రయత్నిస్తాను" ఆలోచనగా చెప్పింది.

హెన్రీ జేబులోంచి సిగరెట్ పెట్టె తీసి, అది ఖాళీదని గ్రహించి పారేసి చెప్పాడు.

"నేను వెళ్ళి సిగరెట్స్ తెచ్చుకుంటాను. నువ్వేమీ చేసుకోనని మాటివ్వు."

ఆమె మౌనంగా ఉండిపోయింది. తర్వాత చెప్పింది.

"నేను వెళ్ళి కొనుక్కొస్తాను."

"సరే. నడక, తాజాగాలి నీకు మంచిది. బ్రిడ్జ్‌దాకా నడిచి వెళ్ళిరా."

"బ్రిడ్జ్ మీంచి వ్యూ బావుంటుంది. నీళ్ళు చాలా ప్రశాంతంగా ఉంటాయి. అక్కడ చల్లటిగాలి వీస్తుంది. అక్కడికి వెళ్ళి సేద తిరిగిరా" హెన్రీ సూచించాడు.

"వంతెన! సరే. గుడ్ బై హెన్రీ" థెల్మా బయటకి వెళ్తూ చెప్పింది.

"గుడ్‌బై థెల్మా" హెన్రీ చెప్పాడు.

హెన్రీ, అతని మిత్రుడు థాగ్ మళ్ళీ పార్క్ బెంచ్‌లో కలిసారు.

"మొత్తానికి అది జరిగిపోయిం ది" హెన్రీ చెప్పాడు.

"అంటే నువ్వు.."

"అవును. ఆ కథ ముగిసింది."

ఆ ఇద్దరూ కొద్దిసేపు మౌనంగా కూర్చున్నారు. చివరికి థాగ్ అడిగాడు.

"పోలీసులనించి ఏదైనా ఇబ్బంది కలిగిందా?"

'లేదు. నన్నెవరూ అనుమానించలేదు. నేనింట్లో ఉండగా వంతెన మీంచి దూకేసింది."

మళ్ళీ వాళ్ళ మధ్య కొద్దిసేపు నిశ్శబ్దం.

"ఆ ప్రొఫెసర్ తెలివిగలవాడు" థాంగ్ చెప్పాడు.

"అవును."

"హెన్రీ"

"ఏమిటి?"

"ఆ పుస్తకం, నీ దగ్గర మిగిలి ఉంటే శాండ్ పేపర్ నాకిస్తావా?" థాగ్ అర్థించాడు.

(వచ్చేనెల మరోకథ)

Post your comments